మిర్చి రైతు కుదేలు!

మిర్చి.. ఖరీదైన పంటగా పేరు. సాధారణంగా ఎకరాలో పంట సాగుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ పంట పండిందంటే రైతు లక్షాధికారి, పోయిందా.. ఆ కుటుంబం రోడ్డున పడాల్సిందే. అంత ప్రభావం చూపుతుంది. గతేడాది దిగుబడి, ధర ఆశించిన దానికన్నా అధికంగా లభించడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే వాతావరణం అనుకూలించక తెగుళ్ల బెడద పెరిగింది. నివారణకు విచ్చలవిడిగా మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడి పెరిగిపోయింది. అయినా అప్పటికే నష్టం జరిగిపోవడంతో దిగుబడి పడిపోయింది. దీనికి తోడు ధర భారీగా పతనమవడంతో జీవితకాలానికి సరిపడ నష్టాలు మూటగట్టుకున్నారు.

- మిర్చిలో నల్లి బెడదతో బెంబేలు
- నివారణకు విచ్చలవిడిగా పురుగుమందుల వాడకం
- భారీగా పతమైన ధర
- అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలు



దేవనకొండ వద్ద వైరస్ సోకిన మిరప పంట



ఆలూరు సమీప పొలాల్లో మిరప దిగుబడులను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

దేవనకొండ/ఆలూరు రూరల్ : ఈ సంవత్సరం మిర్చి రైతులను వెంటాడుతున్న భయం నల్లి బెడద. ఈ భయమే ఫెస్టిసైడ్ యజమానులను కోటీశ్వ రులను చేస్తోంది. వ్యవసాయ అధికారులు ఈ – క్రాప్ చేయడానికి తప్పా క్షేత్రస్థాయిలో పంట పొలాలను సందర్శించకపోవడంతో సలహాలిచ్చే వారు కరువయ్యారు. ఇటు వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం, అటు రైతుల నిరక్ష్యరాస్యత ఇవి రెండే ఫెస్టిసైడ్ యజమానుల పెట్టుబడి. ఒక ఎకరా మిర్చికి మందు పిచికారీ **చేయలంటే** వేలల్లో బిల్లులు మోగా**ల్సిందే**. మిర్చి రైతులు ఎదుర్కొం**టున్న** అతి పెద్ద సమ**స్య** బయో మందులు. బ**యో** మందులు షాపుల్లో విచ్చల**వి**డిగా విక్రయిస్తున్నా.. **వ్యవ**సాయ అధికారులు **చోద్యం** చూస్తున్నారు.



తెగులు సోకిన మిరప దిగుబడి

పంట సాగు ఇలా..

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది 18 వేల ఎకరాల్లో రైతులు మిరప పంటను సాగు చేశారు. దేవనకొండ మండలంలో బోరు, బావులు, హంద్రీనీవా కాలువ కింద దాదాపు 10 వేల ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేశారు. ఎకరాలో పంట సాగు చేసేందుకు దాదాపు రూ.2 లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుం**చి అల్ప**పీడనాల ప్రభావంతో మిర్చి **రైతు** నిట్ట నిలువునా ముని**గా**డు. పంట చేతికొచ్చే సమయంలో ఫెగన్ తుఫాన్ రైతులను నట్టేట ముంచింది. దాదాపు పది రోజులపాటు **చి**రుజల్లులు కురిసింది. **కల్లా**ల్లో ఆరబెట్టి వాటిపై టార్పా**లిన్** కప్పడం వల్ల విపరీతమైన **డ్యామే**జ్ ఏర్పడింది. అప్పటికే నష్టాలతో ఉన్న రైతుకు మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టు అయ్యింది. కాయ నల్లగా మారడంతో కొనుగోలు చేసేవారు లేరు. వైరస్ దెబ్బకు పంట ఎర్రబడిపోవడంతో పంటను కోల్పోవాల్సి వచ్చింది. వాతావరణంలో మార్పుల వల్ల పంటలకు తెగులు సోకడంతో కాయలు నల్లగా మారి పోయాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు.

పతనమైన ధర..

గత సంవత్సరం గ్రేడ్–1 మిర్చి ధర రూ.30 వేల వరకు అమ్ముడుబోయింది. డ్యామేజ్ అయిన కాయ దాదాపు రూ.15 వేల నుంచి రూ.16 వేల దాకా కొనుగోలు చేశారు. ఈ ఏడాది క్వింటా రూ.12 వేల నుంచి రూ.14 వేలు దాటడం లేదు. నల్లబడిన కాయను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు.

వ్యవసాయ అధికారులు పొలాల వైపు రావడం లేదు



నేను ఏడు ఎకరాల్లో మిరప పంటను సాగుచేశాను. ఈ యేడాది మిరపకు నల్లి వైరస్ అత్యధికంగా వ్యాపించింది. ఏ మందులు కొట్టాలో తెలియక మందుల షాపుల దగ్గరికి వెళ్తే వివిధ రకాల బయో మందులు ఇచ్చి పిచికారీ చేయమంటున్నారు. ఎన్నిసార్లు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు దిగుబడి పూర్తిగా పడిపోయింది. వ్యవసాయ అధికారులు పొలాల వైపు కూడా చూడటం లేదు.

– జలంధర్, నరిశ్యామల గ్రామం

రెండు ఎకరాల్లో సాగుచేశాను



నేను రెండు ఎకరాల్లో మిరప పంటను సాగుచేశాను. ఈసారి నల్లి బెడద ఎక్కువగా రావడం, మిర్చి ధర పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాం. రెండు లక్షలు పెట్టుబడి పెడితే దానిలో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. తెగుళ్ల నివారణకు విచ్చలవిడిగా మందులు కొట్టాం. మందుల కోసం మందులషాపుల్లో లక్షలాది రూపాయలు అప్పు చేశాం. ఈ అప్పు తీర్చడానికి మాకు ఎన్నేళ్లు పడుతుందో.

– బాలకృష్ణ, దేవనకొండ

పెట్టుబడి కూడా రాలేదు



రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ఎకరాకు రూ.1.20 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట చివరి దశలో తెగులు సోకి కాయలు ఎండిపోయాయి. మార్కెట్లో ధర మాత్రం రూ.12 వేలు కంటే ఎక్కువ లేదు. పంట అమ్మడానికి వెళ్తే రవాణా ఖర్చులు కూడా సరిపోవు. ఈ ఏడాది పంట భారీగా నష్టాలను మిగిల్చింది.

– చిన్న ఈరన్న, రైతు,తుంబళబీడు

క్లుప్తంగా

ఆలయానికి గేటు ఏర్పాటు



గేటును అమర్చిన దృశ్యం

మద్దికెర : స్థానిక కాలువ వీధిలోనున్న ఉమామహేశ్వర దేవాలయానికి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఇనుప గేటును విరాళంగా అందజేశారు. శనివారం ఆలయంలో రూ.50 వేలు విలువజేసే గేటును చేయించి అమర్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతను అభినందించారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు 11 దరఖాస్తులు

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని ఆస్పరి, చిప్పగిరి మండలాల్లో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు 11 దరఖాస్తులు వచ్చినట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. ఆస్పరి మండల మద్యం దుకాణానికి 7 దరఖాస్తులు, చిప్పగిరి మండల దుకాణానికి నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. 10వ తేది ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లక్కీడిప్ ద్వారా డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

మద్దికెర : దాతల సహకారంతో దేవాలయ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్. వీరయ్య అన్నారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపుర నిర్మాణానికి గ్రామానికి చెందిన పారా విశ్వనాథ్, దస్తగిరిగౌడ్ రూ.3.60లక్షలు, పురుషోత్తం చౌదరి రూ.లక్ష, దేవాలయానికి వచ్చిన విరాళాలు రూ.10 లక్షలు మొత్తం రూ.14.60 స్థలం ఇచ్చిన యజమానులకు అందజేసినట్లు తెలిపారు.

గడ్డివాముల దగ్ధం

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామం ఆదోని రోడ్డులో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుని రెండు గడ్డివాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన హరిజన చిన్న ఈరన్న, ఇస్వీ శేఖన్న అనే రైతులు స్థానిక జెడ్పీ హై స్కూల్ సమీపంలో గడ్డివాములు వేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారో లేదా ప్రమాదవశాత్తు జరిగిందో.. శనివారం ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

పేదల వైద్యానికి పెద్ద పీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

పత్తికొండ(తుగ్గలి) : పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు కాన్పులు అయ్యేలా చూడాలని, ఏదైనా అవసమైతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కేఈ, సభ్యులుగా సాంబశివారెడ్డి, సురేష్‌కుమార్, శ్రీనివాసులు, లోకనాథ్, గోవర్ధన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పత్తికొండలోని 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం వైద్యాధికారిణి కల్పన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వ్యక్తి ప్రాణాన్ని సంరక్షించే ఇంజెక్షన్ సీహెచ్‌సీలో అందుబాటులో ఉందన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మద్దికెర : పోటీ ప్రపంచంలో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యం నిర్దేశించుకుని చదవాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి, కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్ అన్నారు. శనివారం స్థానిక శ్రీవిద్యా సాయి డిగ్రీ కళాశాల ఫెస్ట్ 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..యువకుడి మృతి

దేవనకొండ: ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గోనెగండ్ల మండలం బోదెపాడు గ్రామానికి చెందిన హనుమంతు, రంగులు కుమారుడైన జగదీష్ (25) కప్పట్రాళ్ల గ్రామంలో తన మేనమామ కోలి లక్ష్మన్న పొలంలో ఉల్లి పంట కోత కోయడంతో పొలంలోని ఉల్లి బస్తాలను ట్రాక్టర్‌లో వేసుకొని పొలం బయట ఉన్న లారీలోకి తరలించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో జగదీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కర్ణాటక ప్రాజెక్టులపై నోరు మెదపరేం?



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆలూరు: తుంగభద్ర నదిపై కర్ణాటక రాష్ట్రం ఇష్టానుసారంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే కూటమి ప్రభుత్వం నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేంటని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ప్రశ్నించారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆల్మట్టి డ్యాం నిర్మించడంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. అయినప్పటికీ నాడు అడ్డుకునే చర్యలు చేపట్టలేదన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీశైలం డ్యాంలోని నీటినంతా తెలంగాణ వాడుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రాలయం నియోజకవర్గం సమీపంలో కర్ణాటక ప్రభుత్వం బ్రిడ్జ్ కం,బ్యారేజీను రూ.397. 50 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తుంటే సీఎం చంద్రబాబునాయుడు, జలవనరులశాఖ మంత్రి రామానాయుడు, ఆ శాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే తుంగభద్రలో నీటి ప్రవాహం పూర్తిగా పడిపోయిందని ప్రాజెక్టులు నిర్మించుకుంటూ పోతే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదని, అయినా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర రైతాంగానికి న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు.

నీటి సరఫరాలో పాలకుల నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ(తుగ్గలి) : హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. పట్టణంలోని ఓ ప్రవేటు పాఠశాలలో శనివారం హంద్రీనీవా ప్రధాన కాల్వ విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 6.25లక్షల ఎకరాలకు సాగు నీరు, 30లక్షల జనాభాకు తాగునీరు అందించడమే లక్ష్యం కాగా.. దాన్ని పూర్తి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. హంద్రీనీవా ప్రధాన కాల్వ స్థిరీకరణ పనులకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని, అలాగే ప్రధాన కాల్వ లైనింగ్ పనులను రద్దు చేసి కాల్వ వెడల్పు చేపట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి, తిరుపాల్, కారం నాగరాజు,మాజీ సర్పంచ్ సోమశేఖర్, జయరాం మహమహ్మద్, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు నబి రసూల్, కారన్న, తిమ్మయ్య, కృష్ణయ్య, నాగేంద్ర, ఉమాపతి, సురేంద్ర, రామాంజనేయులు, సుల్తాన్, పెద్దవీరన్న, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కబడ్డీ విజేతగా ప్యాపిలి జట్టు



ప్యాపిలి-ఏ జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

హొళగుంద: సిద్ధేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ప్యాపిలి-ఏ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం మొదలైన పోటీల్లో శనివారం ఫైనల్ పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ప్యాపిలి-ఏ, ప్యాపిలి-బి జట్లు హోరాహోరీగా తలపడగ ప్యాపిలి-ఏ జట్టు గెలుపొందింది. గ్రామస్తులు వీరనగౌడ్, తిక్కస్వామి, హెచ్‌జే పవన్ రూ.30 వేలు నగదు, షీల్డ్‌ను విజేత జట్టుకు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ప్యాపిలి-బి జట్టుకు రూ.20 వేలు, మూడవ బహుమతిగా ఆదోని జట్టుకు రూ.10 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన హొళగుంద జట్టుకు రూ.5 వేలను అందజేసినట్లు నిర్వాహకులు తిక్కస్వామి, పవనచారి, అశోక్, దేవరాజ్, మల్లికార్జున తెలిపారు.

నేత్రపర్వం.. లంకాదహనం



పల్లకీ మోసుకుని పరుగున వస్తున్న భక్తులు



బాణసంచా కాల్చడాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హొళగుంద: సిద్ధేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం లంకాదహనం అత్యంత వైభవంగా సాగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, హరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

కమనీయం.. కల్యాణోత్సవం..

ఆలయ పూజారులు సిద్దప్ప, సిద్ధమ్మ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం సిద్ధమ్మను ఆలయంలో ఉంచి సిద్దప్ప మూర్తిని పల్లకీలో కొలువుంచి ఆలయ చుట్టూ, తేరుబజారులో ఊరేగించి కల్యాణ మంటపం చేర్చి ఉంచి మహా మంగళారతి ఇచ్చిన అనంతరం లంకాదహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, ధర్మకర్తలు బాణాసంచాకు నిప్పు పెట్టి ప్రారంభించారు. కల్యాణనంతరం సిద్ధేశ్వరుడు విహార యాత్రకు బయలుదేరి తిరిగి విజయవంతంగా సిద్ధమ్మ వద్దకు చేరినందుకుగాను ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడమే ఈ లంకదహన కార్యక్రమమని రాజ పంపన్న గౌడ్ తెలిపారు. ఉత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా హాజరైయ్యారు. రాత్రి స్థానిక తేరువీధిలో కుడుక కట్టిద తాళి అనే కన్నడ సామాజిక నాటకం ప్రదర్శించారు.



బాణసంచాను కాల్చుతున్న దృశ్యం, తిలకిస్తున్న ప్రజలు

14నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 269వ ఉరుసు ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. ఈనెల 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

జయప్రదం చేయండి

ఆలూరు రూరల్: ఈ నెల 10వ తేదీన ఆదోనిలో జరిగే మిర్చి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న శనివారం ఓ ప్రకటనలో కోరారు. గత రెండేళ్ల నుంచి మిరప పంటకు గిట్టుబాటు ధర లేక జిల్లా రైతులు నష్టపోతున్నారన్నారు. రోజు రోజుకు మిర్చి ధర పతనమవుతోందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని ఎకరాకు 3 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఆదోనిలోని ఎస్కేడీ కాలనీలో ఉన్న ఎన్జీఓస్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు ఉంటుందని, ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పత్తికొండ రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన ఏడాది నుంచి 19ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు వేయనున్నట్లు సబ్ యూనిట్ అధికారి వెంకటేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని 3వ సచివాలయంలో వైద్య సిబ్బందితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రవేటు జూనియర్ కాలేజీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సీహెచ్‌వో వసుంధర, పీహెచ్‌ఎన్ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్ ప్రకాష్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ పుష్ప, ఏఎన్‌ఎం చాముండేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- తుగ్గలి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని తుగ్గలి, పగిడిరాయి వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, హరిత తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ..తుగ్గలి పీహెచ్‌సీలో 8,100, పగిడిరాయి పీహెచ్‌సీ పరిధిలో 5,989 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రవేటు జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ మాత్రలు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూర్మనారయణస్వామి, హనుమన్నస్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

పత్తికొండ రూరల్ : నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఈశ్వరరెడ్డి భవన్‌లో శనివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇక్కడ ఉన్న లేబర్ కార్యాలయం ఆలూరుకు తరలించడం వల్ల ఈ ప్రాంత కార్మికులు గుర్తింపు కోల్పోయారన్నారు. కరువురు కాటాలకు నిలయమైన తుగ్గలి, మద్దికెర, పత్తికొండలో వేలాది మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో లేబర్ అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే లేబర్ కార్యాలయం ఏర్పాటు చేసి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, ఫక్రుద్దీన్, కార్మికులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కౌలుట్ల చెన్నకేశవ స్వామి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలిసిన కౌలుట్ల చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమైనట్లు కార్యనిర్వహణాధికారి ఆర్.వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు స్వామివారికి విశేష పూజలు జరుగుతాయన్నారు. శనివారం అర్ధరాత్రి స్వామివారికి పర్వతారోహణం, ఈనెల 9న ఉదయం స్వామివారికి అభిషేకం, ధ్వజారోహణం, ఆలయ సంప్రోక్షణ, సాయంత్రం అంకురార్పణ, మంటపారాధన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, 10న తెల్లవారుజామున పునర్వసు నక్షత్ర కుంభలగ్నంలో స్వామివారి కల్యాణోత్సవం, 11న ఉదయం రథకలశ స్థాపన, సాయంత్రం మహాసుదర్శన హోమం, 12న ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామార్చన, విశేష అలంకరణ, గజవాహనోత్సవం, 13న ఉదయం సకల దేవతా హోమం, జయాదిహోమాలు, మహాపూర్ణాహుతి, రాత్రి గ్రామోత్సవం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అధ్వానం.. హైవే -167

- రెండేళ్లుగా పూర్తి కాని నిర్మాణం



ఆలూరు సమీపంలో అసంపూర్తి నిర్మాణంతో అధ్వానంగా హైవే - 167

ఆలూరు రూరల్: పట్టణం సమీపంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హైవే 167 నిర్మాణం నిలిచి పోవడంతో రహదారి అధ్వానంగా మారింది. ఏడేళ్ల క్రితం హైవే 167 నిర్మాణం చేపట్టారు. రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్ పనులు వదిలేయడంతో రహదారి కంకర తేలి గుంతల మయంగా మారింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి విజయవాడ, హైదరాబాద్ వైపు నిత్యం వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో.. రోడ్డంతా కుంగిపోయింది. దుమ్ముతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

లీకేజీలను పట్టించుకునేదెవరు?

- తాగునీటి పైపులైన్లకు లీకేజీలు
- గ్రామాల్లో తీవ్రంగా నీటి ఎద్దడి



గూళ్యం-సిద్ధాపురం మధ్యలో ఉన్న వంక వద్ద తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ

హాలహర్వి: వేసవికాలం ప్రారంభంలోనే మండలంలో తాగునీటి సమస్య నెలకొంది. పలుచోట్ల తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పచ్చారపల్లి గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. అలాగే గూళ్యం, సిద్ధాపురం మధ్య వంక వద్ద తాగునీటి పైపులైన్‌కు లీకేజీ పడి నీరు కలుషితమవుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



పచ్చారపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద లీకవుతున్న పైపు, వృథాగా పోతున్న నీరు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



నర్సాపురంలో ఘనజీవామృతం తయారీలో శిక్షణ పొందుతున్న మహిళా సంఘాల సభ్యులు

వెల్దుర్తి: మండలంలోని నర్సాపురం గ్రామ పొదుపు గ్రూపు రైతు మహిళలకు ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువు ఘన జీవామృతం తయారీపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఆవు పేడ, ఆవు మూత్రం, పప్పు ధాన్యాల పిండి, బెల్లం, పుట్టమట్టి తదితరాలు సమపాళ్లలో కలిపి ఉండలుగా చేసి రాబోవు ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యేలా నీడలో ఆరబెట్టి నిల్వ ఉంచేలా దాదాపు 200 కేజీల ఎరువును తయారు చేయించారు.ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్స్ జనార్ధన్, మునిరాజు మాట్లాడుతూ ఏడాదికి ఎకరాకు 400 కేజీల ఘన జీవామృతం పొలంలో చల్లడం వల్ల భూమి గుల్లబారి సారవంతమై, తేమని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. తద్వారా బెట్టను అధిగమించి, పోషకాల లోపం లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. సిబ్బంది హుసేన్, లక్ష్మీదేవి, బాలకృష్ణ, రామచంద్రుడు, దేవరాజు పాల్గొన్నారు.